

నేడు కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం యథావిధిగా స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే డివిజన్,మండల కేంద్రాలతో పాటు సచివాలయాల్లోనూ స్పందన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ప్రజల నుంచి అధికారులు అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ నుంచి రాజమహేంద్రవరం రూరల్‌లోని హార్లిక్స్ ఫ్యాక్టరీ ఎదుట గల కలెక్టరేట్ వరకూ ఎప్పటిలానే ఉచిత బస్సు సర్వీసులు నడుస్తాయన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అర్జీదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'అడిషనల్' బాదుడు షురూ..!

పెరిగిన ఎయిర్ కండిషనర్ల వినియోగం
కిలోవాట్‌కు రూ.1,800 చొప్పున వసూలు
జిల్లా వినియోగదారులపై రూ.2.51 కోట్ల భారం



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యుత్ వినియోగదారులపై రాష్ట్ర ప్రభుత్వం మరో బాదుడుకు తెరలేపింది. ఉక్కపోతల నుంచి ఉపశమనం కోసం ఎయిర్ కండిషనర్లు నూతనంగా కొనుగోలు చేస్తున్న వారిని గుర్తించి అడిషన్ ఛార్జీల వసూలు ప్రారంభించింది. గృహ విద్యుత్ వినియోగదారుల నుంచి సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, కిలోవాట్‌కు రూ.1500, ఇతర ఛార్జీలు రూ.100 కలిపి రూ.1,800 చొప్పున డిమాండ్ నోటీసులు జారీ చేసి ంది. అదే విధంగా కమర్షియల్ వినియోగదారులకు కిలో వాట్‌కు రూ.2వేలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200 చొప్పున చెల్లించాలని నోటీసులు అందిస్తోంది. గడిచిన 12 నెలల్లో రాజమండ్రి డివిజన్ వ్యాప్తంగా 16 సెక్షన్ల పరిధిలో అధికారులు సర్వే చేసి 4,233 మంది అదనపు వినియోగం చేస్తున్నారని గుర్తించారు. వీరందరకూ నిర్ణీత సమయంలో నోటీసులు ఇచ్చిన మేరకు సొమ్ములు చెల్లించాలని పేర్కొంది. ఇలా అక్షరాలా రూ.2.51 కోట్లు వసూలుకు రంగం సిద్ధం చేసింది. వేసవి నేపథ్యంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిన విషయం విధితమే. అధికారులు గణాంకాల ప్రకారం ఫిబ్రవరిలో రోజువారీ విద్యుత్ వినియోగం సుమారుగా 18 మిలియన్ యూనిట్లు ఉండగా మార్చిలో 20 మిలియన్ యూనిట్లకు పెరిగింది. ఏప్రిల్లో రోజువారీ వినియోగం సుమారుగా 24 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. 'అదనపు' వినియోగదారులను గుర్తించి వారి నుంచి అదాయం పొందేలా విద్యుత్ సంస్థ కసరత్తు పూర్తి చేసింది.

'అడిషనల్' బాదుడు

విద్యుత్ సర్వీసు కనెక్షన్ తీసుకునే సమయంలో వినియోగ సామర్థ్యం ఆధారంగా డిపాజిట్ చెల్లించి కనెక్షన్ అందజేస్తారు. తర్వాత కుటుంబ అవసరాలు, ఆర్థిక స్థోమత పెరిగే కొద్దీ అదనపు పరికరాలు కొన కొనుగోలు చేయడం పరిపాటి. ఫలితంగా విద్యుత్ వినియోగం పెరుగుతుంది. దీంతో విద్యుత్ సంస్థ బాదుడు మె దలవుతుంది. తొలుత కనెక్షన్ తీసుకున్న సమయంలో పేర్కొన్న కెపాసిటీకి మించి విద్యుత్ వాడడంతో కిల వాట్‌కు అదనంగా డెవలపమెంట్ ఛార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్లు, అప్లికేషన్ ఫీజు, సూపర్ విజన్ ఛార్జీలు, ఎస్‌బిఎస్‌టి, సిజిఎస్‌టి తదితరాల పేరిట మొత్తంగా ఒక్కొక్కరూ రూ.1800 వరకూ చెల్లించాల్సి వుంటుంది. ఎసి ఉపయోగిస్తే నెలకు అదనంగా రెండు కిలోవాట్ల విద్యుత్ వాడకం వుంటుంది. దీంతో కొత్తగా ఎసిలు ఉపయోగిస్తున్న వారిని అదనపు మొత్తాలు చెల్లించమంటూ విద్యుత్ శాఖ నోటీసులు పంపుతోంది. గడువులోగా చెల్లిచకుంటే కనెక్షన్ తొలగిస్తామన్న హెచ్చరికలు నోటీసులో వుంటున్నాయి. సగటున చూస్తే ఏసీలు కొని నెల పాటు వాడిన వారందరికీ కనీసంగా రూ.4 వేలు చెల్లించాలని నోటీసులు జారీ అవుతున్నాయి.

మధ్య తరగతిపై పెనుభారం

వేసవి నేపథ్యంలో అత్యధికంగా మధ్య తరగతి కుటుంబాలు నెలసరి వాయిదాలపై ఎసిలు కొనుగోలు చేస్తున్నారు. వేసవిలో ఎండలు మండిపోతుండటం, ఉక్కపోత, ఫ్యానుగాలి కూడా వేడిగా రావడంతో ఎక్కువగా ఎసిలపై మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పదుల సంఖ్యలో ఏజెన్సీలు, రిటైల్ దుకాణ -లు 50 వరకూ వున్నాయి. రాజమహేంద్రవరంలోని ఓ ప్రముఖ ఏజెన్సీలోనే గత నెలలో 600 ఎసిలు, ఈ నెలలో 500పైగా ఎసిలు అమ్ముడయ్యాయి. ఏసీ వినియోగంతో నెలవారీ కరెంటు బిల్లులు పెరుగుతాయి. అయిదు ఐదు వందలు దాటని బిల్లులు చెల్లించేవారు కూడా నెలకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు చెల్లించక తప్పడంలేదు. వేసవిలో మూడు నెలల పాటు తప్పనిసరై ఈ అదనపు భారాన్ని భరించేందుకు సిద్ధపడుతున్నారు.

సర్వీసు కెపాసిటీ మేరకే విద్యుత్ వినియోగించాలి

విద్యుత్ సర్వీసు కోసం దరఖాస్తు చేసే సమయంలో అందులో పేర్కొన్న కెపాసిటీ మేరకే విద్యుత్ వినియోగించాల్సి వుంటుంది. అడిషనల్ కిలోవాట్ల విద్యుత్ వాడితే విద్యుత్ సంస్థ నిబంధనల ప్రకారం అనుమతి తీసుకుని ఛార్జీలను చెల్లించాల్సి వుంటుంది. పాదర్శకత పాటించడం వల్ల విద్యుత్ వినియె నాగదారులందరికీ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి, ఆయా ప్రాంతాల్లో ట్రాన్స్ఫార్మర్ల సామర్థ్యం పెంచడానికి ఆదాయం తోడ్పడుతుంది. వినియోగదారులు సహకరించాలి. సకాలంలో బిల్లులు చెల్లించాలి.

- నక్కపల్లి శామ్యూల్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఎపిఇపిడిసిఎల్,. రాజమహేంద్రవరం



సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి

'సహకార' ప్రయివేటీకరణపై పోరాటం

ఎపి సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర మహాసభలో ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి- ధవళేశ్వరం

సహకార సంఘాల ప్రయివేటీకరణపై పోరాటం ఉధృతం చేయాలని, సహకార ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎపి సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర 7వ మహాసభ ఆదివారం బొమ్మూరులోని చెరుకూరి కన్వెన్షన్ హాల్లో పివి.సత్యనారాయాయణరాజు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ఎంఎల్‌సి ఐవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాల్లో 50శాతం వాటాలను ప్రైవేట్ వ్యక్తులకు, కంపెనీలకు, ఫండ్స్‌కు కేటాయిస్తూ 1964 సహకార సంఘాల చట్టానికి సవరణ చేసిందన్నారు. మేనేజింగ్ కమిటీలోకి వృత్తి నిపుణుల పేరుతో ప్రైవేట్ వ్యక్తులను ప్రవేశపెట్టి ఓటింగ్ హక్కును కల్పించిందన్నారు. ఫైనాన్స్ బ్యాంకు ప్రతినిధులను కూడా మొదటిసారిగా మేనేజింగ్ కమిటీలోకి తీసుకొచ్చి ఓటు హక్కును కల్పించిందన్నారు. రైతుల చేతుల్లో ఉన్న పిఎసిఎస్‌లు ప్రైవేట్ వ్యక్తులు కంపెనీ చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పిఎసిఎస్‌లను కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం చెప్పిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అందుకు అనుగుణంగా నోడల్ అధికారిని నియమించిందన్నారు. పిఎసిఎస్‌ల ప్రయివేటీకరణ వల్ల రైతులకు, సహకార సంఘాల్లో పని చేసే ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సంఘాలపై కత్తి కట్టాయని విమర్శించారు. ఈ సమావేశంలో డిసిసిబి చైర్మన్ ఆకులు వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల ఉద్యోగుల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తుందని తెలిపారు. ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేస్తామని, పిఎసిఎస్‌ల ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి పెంకె సత్యనారాయణ మాట్లాడుతూ పిఎసిఎస్ ఉద్యోగులకు వైద్యనాథన్ కమిటీ సిఫార్సుల అనుసరించి ఐదు సంవత్సరాలకు ఒకసారి వేతన సవరణ చేయాల్సి ఉందన్నారు. 2009లో వేతనాల స్కేల్ నిర్ణయిస్తూ 151 జిఒ విడుదలైందన్నారు. దీని అమలు కోసం 2011లో సమ్మెకు ద ఇగాల్సి వచ్చిందన్నారు. 2014 నుంచి కొత్త వేతనాలు అమల్లోకి రావాల్సి ఉండగా 2019 వరకు వేతన సవరణ లేదన్నారు. 2019లో విడుదలైన జీవో 36 ప్రకారం ఇవ్వాల్సిన వేతనాలు ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అజయ్ కుమార్ మాట్లాడుతూ పిఎసిఎస్ లను కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమాలు నిర్మిస్తామన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడుతూ సహకార సంఘాల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులు, రైతులు కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఇప్పటికే దేశంలో రాష్ట్రంలో సహకార వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. కొనవుపిరితో ఉన్న సహకార వ్యవస్థను ఉద్యమాల ద్వారా కాపాడుకోవాలన్నారు. ఈ సమావేశం ప్రారంభానికి ముందు అమరులకు నివాళి లర్పించారు. కార్యదర్శి నివేదికను, ఆర్థిక నివేదికను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి తోట వెంకటరామయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.ఆదినారాయణ, కెవివి.సత్యనారాయణ, వై.రామచంద్రరావు, తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, రాష్ట్ర నలుమూలల నుండి 350 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

మేడే వారోత్సవాల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ధవళేశ్వరం


కార్మికులంతా మేడేలో పాల్గొనాలని, వాడ వాడలా ఎర్రజెండాలను ఎగురవేసి వారోత్సవాలు విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ పిలుపునిచ్చారు. ధవళేశ్వరం సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎం.సుందరబాబు అధ్యక్షతన జరిగిన మేడే సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడేను కార్మికులంతా విజయవంతం చేయాలన్నారు. ఎందరో కార్మికులు పోరాటాల నుంచి పుట్టిందే మేడే అని అన్నారు. మేడే పోరాట స్ఫూర్తితో ప్రపంచంలో కార్మికులు 8గంటల పని విధానం, కనీస వేతనాలు, కార్మికుల సౌకర్యాలు సాధించుకున్నారన్నారు. ప్రస్తుతం పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక మాంద్యం కారణంగా కార్మికుల హక్కులు, సౌకర్యాలు పాలకులు పెట్టుబడిదారుల లాభాలు కోసం కోతపెడుతున్నారన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న తరుణంలో జరుగుతున్న మేడేను కార్మికులు పెద్దఎత్తున పాల్గొని పాలకుల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను త్రిప్పికొట్టలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా కార్యదర్శులు ఎస్ఎస్.మూర్తి, కర్రి రామకృష్ణ, వై.బేబిరాణి, కె.పోసమ్మ, కె.అన్నామణి, జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్, టి.సుబ్బలక్ష్మి, శంకర్,సత్యనారాయణ, సాగర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్

జేగురుపాడుకు రాష్ట్ర స్థాయి అవార్డు

ప్రజాశక్తి- కడియం



సర్పంచ్ స్టాలిన్ దంపతులు

జేగురుపాడు పంచాయతీకి రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. సర్పంచ్ యాదల స్టాలిన్ ఆధ్వర్యంలో గ్రామం అభివృద్ధి పదంలో పయనిస్తోంది. ఈ గ్రామ పంచాయతీలో అన్నీ ప్రత్యేకతలే. స్వచ్ఛ తాగునీటి ఎటిఎం, సువిశాలమైన పార్కు, మరుగుదొడ్డి జగాలేనివారికి కూడా వ్యక్తిగత మరుగుదొడ్డి సౌకర్యం, ఉచిత సులబ్ కాంప్లెక్స్, సకల సౌకర్యాలతో వేళకు తెరుచుకొనే ప్రభుత్వ కార్యాలయాలు ఇలా సుపరిపాలనలో బెస్ట్ అనిపించుకొంటోంది. 2006-11 మధ్యలో సర్పంచ్‌గా చేసిన యాదల దేవదీవెనకుమారిస్టాలిన్ పాలనతో జేగురుపాడు రూపురేఖలు మారాయి. వారి హయాంలో నిర్మల్ పురస్కార్, స్టేట్ బెస్ట్ పంచాయత్, గూగుల్, రాజీవ్ గాంధీ ఎక్సలెన్స్ అవార్డులను సొంతం చేసుకుంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో స్టేట్ బెస్ట్ పంచాయతీగా ఎన్నికైంది. అందుకు సర్పంచ్ స్టాలిన్ ఆధ్యుడని చెప్పవచ్చు. సర్పంచ్ అనేది హోదాగా కాకుండా అదొక బాధ్యతని గుర్తెరిగిన పాలకునిగా ఆయన గుర్తింపు పొందాడు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం తపన, కృషి, పట్టుదల ఆయన సొంతం. ఆర్థిక సంఘం నిధుల వినియాగం నుంచి పరిసర పరిశ్రమల నుంచి నిధుల సమీకరణతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారు. స్టేట్ అవార్డు సాధించిన ఈ గ్రామం వుమెన్ ఫ్రేండ్లీ పంచాయతీగా సేవలు అందించి న్నందుకు ఈ అవార్డుకు ఎంపిక అయ్యిందని సర్పంచ్ స్టాలిన్ తెలిపారు. గ్రామాభివృద్ధికి సహకరించిన పంచాయతీ సభ్యులు, ప్రజలు, పంచాయతీ సచివాలయ సిబ్బంది కృషికి నిదర్శనమే ఈ అవార్డు అన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లిలో ఎంఎల్ఎ తలారి వెంకట్రావు క్యాంపు కార్యాలయంలో ఆదివారం పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన గోపాలకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. 50 మంది పేదలకు వారు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత, నియోజకవర్గ పరిశీలకులు జి.వెంకటేశ్వరరావు, ఎంపిపి కెవికె.దుర్గారావు, ఎఎంసి చైర్మన్ జనార్ధనరావు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో అకాల వర్షం

ప్రజాశక్తి - గోపాలపురం, దేవరపల్లి, తాళ్లపూడి



గోపాలపురం మండలంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున అకాల వర్షం కురిసింది. ఈ వర్షానికి రైతులు నానా ఇబ్బందులకు గురయ్యారు. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. గోపాలపురం మండలం వెంకటాయపాలెంలో పొలంలో ఉంచిన ధాన్యపు రాసులు తడిసి ముద్దయ్యాయి. వీటిని జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యంపై ఐదుశాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. దీని వల్ల మొలక రాకుండా ధాన్యం రంగుమారకుండా కాపాడుకోవచ్చన్నారు. రైతులకు గోనె సంచులను అందుబాటులో ఉంచాలన్నారు. మండలంలో 120 మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం తడిసినట్టు గుర్తించారు. వీటిని కళ్లాల నుంచి ఆర్‌బికెలకు తరలించే చర్యలు చేపట్టారు. ఆయన వెంట కొవ్వూరు ఎడిఎ పి.చంద్రశేఖర్, ఎఒ బి.రాజారావు, విఎఎ ఝాన్సీ రాణి ఉన్నారు. వెంకటాయపాలెం, చిట్యాల గ్రామాల్లో తడిసిన ధాన్యపురాసులను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకట్రాజు పరిశీలించారు. వెంటనే ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. దేవరపల్లి మండలంలో కురిసిన వర్షానికి ధాన్యం రాసులు, మొక్కజొన్న కండెలు తడిచిపోయాయి. అకాల వర్షానికి తడిసి ముద్దయ్యాయని రైతులు తెలిపారు. రైతులను వెంటనే ఆదుకోవాలని లేకుంటే నిరవధిక దీక్షకు దిగుతామని టిడిపి గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు అన్నారు. గౌరీపట్నంలో వర్షం వల్ల తడిసిన ధాన్యంను ఆయన పరిశీలించారు. తాళ్లపూడి మండలంలో 33.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షానికి ధాన్యంతో పాటు మొక్కజొన్న పంటలు తడిచిపోయాయి. అకాల వర్షం కారణంగా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టామని ఎఒ రుచిత తెలిపారు.



తాళ్లపూడిలో వర్షానికి తడిసిన పచ్చి ఇటుకలు

విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సదస్సులు

ప్రజాశక్తి - గోపాలపురం

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి గోపాలపురం సబ్ డివిజన్‌లో సదస్సులు నిర్వహిస్తున్నామని ఆ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఐ.మల్లేశ్వరరావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారవేదికకు(సిజిఆర్ఎఫ్) చైర్మన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏలూరు సర్కిల్ నిడదవోలు డివిజన్‌లోని, గోపాలపురం సబ్ డివిజన్ కార్యాలయంలో ఈనెల 28వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే సదస్సులో వినియోగదారులు నేరుగా పాల్గొని సమస్యలను, ఫిర్యాదులను సిజిఆర్ఎఫ్ కమిటీకి తెలియ జేయొచ్చన్నారు. అలాగే విశాఖపట్నం సీతమ్మధారలోని ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సిజిఆర్ఎఫ్ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా కూడా ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. వీటిని పరిశీలించి విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. ఈ సదస్సులో చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ, సిజిఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.హరిబాబు, పి.శ్రీనివాస్, డాక్టర్ రాయసం సురేంద్రకుమార్ పాల్గొంటారని తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిడదవోలు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. వీర భద్రరావు కోరారన్నారు.



ప్రచారభేరిలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రాంబాబు

నిడదవోలులో 'ప్రచారభేరి'

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలులోని మార్కెట్, అంబేద్కర్ చౌక్, చర్చిపేట ప్రాంతాల్లో ఆదివారం సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ప్రచారభేరిని నిర్వహించాయి. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం దేశంలో ప్రతి అంగులాన్ని అదానీకి అప్పగిస్తూ దేశ సంపదను ధారాదత్తం చేస్తుందన్నారు. రాష్ట్రంలో కృష్ణపట్నం, గంగవరం పోర్టులు ఇప్పటికే అదానీ సొంతం అయిపోయాయన్నారు. అయినా జగన్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించడం ద్వారా దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గండి శ్రీనివాసరావు, టి.నాని, ప్రసాద్, అశోక్, అనీల్, సుబ్బారావు, రాము, త్రిమూర్తులు తది తరులు పాల్గొన్నారు

కంటైనర్‌ను ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి మండలం యర్నగూడెం జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి కాకినాడ జిల్లా పెద్దాపురానికి ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రాణహాని జరగలేదు.



వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్‌నాయుడు

వెంకటేశ్వరరావుకు ఎంఎల్ఎ శ్రీనివాస్‌నాయుడు పరామర్శ

ప్రజాశక్తి - పెరవలి

ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన ముక్కామలకు చెందిన వైసిపి నాయకులు నందిగాం వెంకటేశ్వరరావును స్థానిక ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపిపి కె.సీతారాంప్రసాద్, వైసిపి మండల అధ్యక్షులు వీరమల్లు సత్యనారాయణ, వైస్ ఎంపిపి వేంద్ర శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు గండేపల్లి రామకృష్ణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

కరోనా కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన కొల్లు శ్రీవాసవిప్రవల్లిక, కొల్లు ఉమాశంకర్‌లకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.10లక్షల విలువ చేసే చెక్కులను హోం మంత్రి తానేటి వనిత ఆదివారం అందజేశారు. కొవ్వూరులోని హోం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున రెండు చెక్కులను ఆమె అందించారు. ఐదు లక్షల చొప్పున రెండు చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు. రాజమహేంద్రవరం జండా పంజా రోడ్డులో నివాసం ఉంటున్న కొల్లు శ్రీవాసవిప్రవల్లిక, ఉమాశంకర్ అక్కాతమ్ముళ్లు. 2021లో కరోనా కారణంగా వారు తల్లిదండ్రులను కోల్పోయారు. ప్రస్తుతం వారు అమ్మమ్మ ఇంట్లో ఉంటున్నారు. సిఎం సాయం పట్ల బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

కార్టూ'నిజం'



ఛార్జీల పెంపు మన బాధ్యత కద్సార్..!!!

సంస్కరణలతో మెరుగైన పాలన

రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - గోపాలపురం



సభలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడ లేని విధంగా పాలనలో అనూహ్య సంస్కరణలను తీసుకొచ్చారని, నాలుగేళ్లలో అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలో రు.2.7లక్షల కోట్లను సంక్షేమ పథకాలకు అందించారని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంతి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆదివారం గోపాలపురంలో రూ.1.51 కోట్లతో నిర్మించిన తహశీల్దార్ కార్యాలయయం, ఆర్‌బికె, సచివాలయాలను ఆయన ప్రారంభించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ కె.మాధవీలత, ఎంఎల్ఎలు తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద నిర్వహించిన సభలో మంత్రి ధర్మాన మాట్లాడారు. నిష్పక్ష పాతంగా పాలన చేస్తూ జగన్ ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని చూరగొన్నారన్నారు. అర్హులకు నేరుగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. కొన్ని పనులు ఆలస్యమైనప్పటికీ అన్ని అంశాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో చేస్తున్నామన్నారు. రెవెన్యూ శాఖలోనూ పలు సంస్కరణ తెస్తున్నామన్నారు. ఇప్పటికే 2 వేల గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. మే నాటికి డ్రోన్ సర్వే ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. 20 ఏళ్లుగా సాగుచేస్తున్న రైతులకు వారి అర్హతను గుర్తించి భూములను ఇచ్చేందుకు త్వరలో చర్యలు తీసుకునే ఆలోచనలో ఉన్నామన్నారు. ఇన్‌ఛార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా వాలంటరీ, సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా సంక్షేమ పథకాలు ప్రజల ఇంటివద్దకే చేరుతున్నాయన్నారు. కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ ప్రభుత్వం పథకాల ప్రయోజనాలను అర్హులందరికీ జవాబుదారీతనంతో అందిస్తున్నామన్నారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ పథకాలకు అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతు సంక్షేమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఎంఎల్ఎ తలారి వెంకట్రావు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నారన్నారు. నియోజక వర్గంలో 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రహదారి అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఆర్‌బికెల ద్వారా భూసార పరీక్షలను రైతుల చెంతకు చేర్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జడ్‌పిటిసి సభ్యులు కె.లలిత, కూసం రామ్మోహన్‌రెడ్డి, వెలగా శ్రీరామ్మూర్తి, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, తహశీల్దార్ రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పురుగు మందు తాగిన వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - పెరవలి

పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఖండవల్లి గ్రామానికి చెందిన ఆకుల సూర్యనారాయణ (62) ఆదివారం మరణించాడు. ఆయనకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులుతణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.సూర్యభాగవాన్ తెలిపారు.

పేకాడుతున్న ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్


మండలంలోని జి.మేడపాడులో దండమ్మ తల్లి ఆలయం సమీపంలో పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.42,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సామర్లకోట సిఐ కె.దుర్గాప్రసాద్ ఆదివారం రాత్రి తెలిపారు.

మోదుగులమ్మ జాతర ప్రారంభం

తాళ్లపూడి : మూడు రోజులపాటు జరగనున్న తాళ్లపూడి గ్రామ దేవత మోదుగులమ్మ జాతర ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. బాణసంచా కాల్పులు, శక్తి వేషాలు ఆకట్టుకున్నాయి. గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పలువురు జాతరలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సర్పంచ్ నక్క వెంకటఅనురాధ, చిట్టిబాబు కుటుంబీకులు రూ.40 వేల విలువగల మంగళసూత్రాలను అమ్మవారికి అందించారు.

జలసిరితో సాగునీటి కష్టాలు చెల్లు

డ్వామా పీడీ రామ్‌గోపాల్





ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలసిరి పథకంతో రైతులకు సాగునీటి కష్టాల నుంచి ఊరట లభించనుందని డ్వామా పీడీ రాంగోపాల్ తెలిపారు. వైఎస్ఆర్ జలకళలో భాగంగా భూగర్భ జలాలు అందుబాటులో ఉన్న రైతుల పొలాల్లో ఉచితంగా ప్రభుత్వం ఈ పథకం ద్వారా బోర్లను వేస్తోంది. జిల్లాలో ఈ పథకం ఇప్పటికే కార్యరూపంలోకి వచ్చింది. బోర్ల డ్రిల్లింగ్ ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఈ సందర్భంగా ప్రజాశక్తి డ్వామా పీడిని పలకరించింది. ఆయన తెలిపిన వివరాలు మాటల్లోనే....

జిల్లాలో ఎన్ని బోర్లు వేయాలని లక్ష్యంగా తీసుకున్నారు..

జిల్లావ్యాప్తంగా 3,125 బోర్లు వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాము. బోర్లు అవసరమైన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించాము. ఇప్పటివరకు ఆన్లైన్, సచివాలయాల ద్వారా 4,570 దరఖా స్తులు అందాయి. వచ్చిన వాటిలో 3,970 దరఖాస్తు లకు ఆమోదముద్ర లభించింది. ఆమోద ముద్ర వేసిన దరఖాస్తులను డ్వామా (జిల్లా నీటి యాజమాన్యం సంస్థ) ఎపిడి లాగిన్ అయింది. ఎపిడి జియాలజిస్టుల సర్వే కోసం పంపారు. 374 దరఖాస్తులను తిరస్కరించారు. మరో 336 వివిధ కారణాలతో పెండింగ్‌లో పెట్టారు. 1,628 దరఖాస్తులకు పరిపాలనా అనుమతులు లభించాయి.

ఎక్కడ పనులు ప్రారంభించారు. ఎంత ఖర్చు అవుతుంది..

జిల్లాలోని ఏడు నియోజక వర్గాల్లో జలసిరి పనులను ప్రారంభించాము. అనపర్తి, జగ్గంపేట, రాజానగరం, రాజమండ్రి రూరల్, కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజక వర్గాల్లో పనులు ప్రారంభించాము. పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటి వరకూ 938 బోర్ల డ్రిల్లింగ్ పూర్తయింది. 693 బోర్ల డ్రిల్లింగ్ పురోగతిలో ఉన్నాయి. 52 బోర్లకు విద్యుత్ సదుపాయం కల్పించాము. 40 బోర్లకు మోటార్లు సైతం అమర్చాము. మిగిలిన వాటికి త్వరితగతిన పూర్తి చేసేందుకు కషి చేస్తున్నాము. ఒక్కో బోరుకు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు అవుతుంది. మరింత మంది రైతులకు మేలు చేయాలన్న సంకల్పంతో వైఎస్సార్ జలకళ అమలులో ప్రభుత్వం ఉచితంగా బోర్లు వేసి రైతులకు సాగునీరు అందిస్తోంది.

ఈ పథకానికి ఎవరు అర్హులు.. నిబంధనలు ఏమిటి..

తొలుత ఐదెకరాల్లోపు మెట్ట, రెండున్నర ఎకరాల్లోపు మాగాణి ఉన్న చిన్న, సన్న కారు రైతులకే బోర్లు వేయాలని నిర్ణయం తీసుకున్నారు. సాగు విస్తీర్ణంతో సంబంధం లేకుండా వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతూ అర్హుడేనని తేల్చి చెప్పింది. సన్న, చిన్నకారు రైతులతో పాటు మధ్యతరగతి, పెద్ద రైతులకు సైతం లబ్ధి చేకూర్చాలని మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. భూగర్భ జలాలు అందుబాటులో ఉన్న ప్రతి రైతు పొలంలో ఉచితంగా బోరు వేసి సాగునీటికి భరోసా కల్పించాలని పథకంలో మార్పు చేసింది. చిన్న, సన్న కారు రైతులకు బోరుతో పాటు ఉచితంగా మోటారు కూడా అందజేయనున్నాము.

దరఖాస్తులు ఎలా చేసుకోవాలి..

సచివాలయాలలో వాలంటీర్ ద్వారా బోరు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి, విఆర్ఓ దరఖాస్తును పరిశీలించి డ్వామా విభాగానికి పంపిస్తారు. హైడ్రో జియలాజికల్, జియో ఫిజికల్ సర్వే ద్వారా రైతుల భూమిలో ఎక్కడ వేయాలని శాస్త్రీయంగా నిర్ధారిస్తారు. ఈ సర్వే ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది. ఒక వేళ బోరు వేసిన చోట నీరు పడకపోతే మరో చోట గుర్తించి బోరు వేస్తాము. అప్పటికే బోరు ఉన్న భూమిలో బోరు వేసేందుకు అవకాశం లేదు. రైతు భూమిలో బోరు ఉండి మరమ్మతులకు గురైతే మరో బోరువేస్తాము. ఎంత మేరకు బోరు తవ్వితే ఆ మేరకు కేసింగ్ పైపు కూడా ఉచితంగా అందజేస్తాం.

రైతులు బోర్లు వేసుకోవాలంటే ఎంత ఖర్చు అవుతుంది..

బోరు వేసుకోవాలంటే రూ. లక్ష ఖర్చు చేయాల్సి వస్తుంది. రెవెన్యూ, భూగర్భ జలశాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. రూ.లక్షల్లో ఖర్చు పెట్టినా కొన్నిసార్లు ఫెయిలవడం సాధారణంగా జరుగుతుంటుంది. దీంతో రైతులు ఆర్థికంగానూ, మానసికంగానూ ఇబ్బందులు ఎదుర్కొనేవారు. జియాలజిస్ట్ ఖర్చులు భరించలేక అవస్థలు పడేవారు. ఈ సమస్యలకు చెక్ పెడుతూ వైఎస్సార్ జలకళ పథకానికి శ్రీకారం చుట్టింది. ఎక్కడ బోరు చేసేది శాస్త్రీయంగా నిర్ణయించి బోర్లు అందుబాటులోకి తెస్తోంది.

యానాం వార్తలు



నివాళులర్పిస్తున్న అధికారులు, కుటుంబ సభ్యులు

ఘనంగా సావిత్రి శతజయంతి

ప్రజాశక్తి - యానాం

ఫ్రెంచ్ పాలన నుంచి యానాం విముక్తి కోసం పోరాడిన స్వాతంత్ర సమరయోధురాలు, తొలి మహిళా ఎంఎల్ఎ కామిశెట్టి సావిత్రి శతజయంతి వేడుకలు సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆమె విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి, వ్యవసాయ శాఖ అధికారి గణేషన్, ఎస్‌పి రఘునాయిగన్, పొనుగుమట్ల విష్ణుమూర్తి తదితరులు పూలమాల లేసి నివాళులర్పించారు. అనంతరం వద్ధులకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సావిత్రి కుటుంబ సభ్యులు సావిత్రి ఆండాల్, పైడికొండల రాజబాబు, సూర్య లక్ష్మి, వెలగ కోటీశ్వరి, చిక్కాల సావిత్రి, లక్ష్మి, సాధనాల బాబు, చెక్కల అరుణ్ కుమార్, ఖండవల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదంలో ధ్వంసమైన వాహనం

బారికేడ్లు లేక ప్రమాదాలు

ప్రజాశక్తి - యానాం

ప్రమాదమని తెలిసిన యానాం-కనకాలపేట గోదావరి ఏటిగట్టు రోడ్డుపై ఉన్న భారీ కేడ్లు పోలీసులు తీశాసారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటిగట్టు రహదారిపై వేగంగా వాహనాలు నడుపుతుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. గతంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను తిరిగి యథాస్థానంలో పెట్టాలని పోలీసులను స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేటలో కొలువైన పోలేరమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఆదివారం పోలేరమ్మ యూత్ ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ కోణంబట్ల శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన తిరణం మాచరరావు, ధరణి దంపతులచే అమ్మవారి మూలవిరాట్‌కు పంచామతాభిషేకం, సహస్ర కుంకుమార్చన చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొని పూజలు చేశారు

కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి ఇటీవల గ్రౌండ్ టెస్ట్‌లో ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు యానాం వద్ధాశ్రమం ద్వారా ఉచిత కోచింగ్ అందించనున్నట్లు ఓల్డ్ ఏజ్ హోమ్ వ్యవస్థాపకులు మల్లాడి కష్ణారావు తెలిపారు. ఈ మేరకు ఓల్డ్ ఏజ్ హోమ్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాలుష్య కుంపటిగా డంపింగ్ యార్డ్

దుర్వాసన, పొగతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో స్థానిక కనకాల పేట ఏటిగట్టు మార్గంలో ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డులో చెలరేగిన మంటలు నిత్యాగ్నిహోత్రంలా మండుతూ కాలుష్య కుంపటిగా తయారయ్యింది. రహదారిపై నిత్యం ప్రయాణించే వారిపై విషపూరిత వాయువులను వెదజల్లుతోంది. ప్రజారోగ్యాలకు హానికరంగా మారిన వాయు కాలుష్యంపై స్థానికులు, రైతులు చేసిన ఫిర్యాదులపై నియంత్రణ కరువైందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తా చెదారం, ఇతర వ్యర్థాలు గుట్టలు, గుట్టలుగా పడి ఉన్నాయి. దీంతో కొంత కాలంగా కాలుతున్న ఈ వ్యర్థాల నుంచి దట్టమైన పొగలు వెలువడుతూ వాయు కాలుష్య ఉత్పత్తి కేంద్రంగా స్థానిక డంపింగ్ యార్డు మారింది.వాస్తవానికి ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలను తడి,పొడి చెత్తగా వేరు చేయడంతోపాటు అందులోని ప్లాస్టిక్,ఇతర వ్యర్థాలను కూడా వేరు చేయాలి.ఇలా వేరు చేసిన తడి చెత్తను కంపోస్ట్ కింద మార్చాలి.కానీ స్థానికంగా ఆ పని జరగడం లేదన్న ఆరోపణలున్నాయి.ఇక్కడి డంప్ యార్డు చెత్తలో రబ్బరు,ప్లాస్టిక్,థర్మకోల్, ఫైబర్ మొదలైన పనికిరాని వస్తువులను వేరు చేయడం లేదంటున్నారు. మున్సిపల్ పరిధిలోని డంపింగ్ యార్డులో చెత్త కాలుతున్న మంటలను అదుపులోకి తీసుకొని వాయు కాలుష్యం లేకుండా చూడాల్సిన అధికారులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నామని చేతులు దులిపేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల గల గ్రామాలే కాకుండా యార్డు పక్కనుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు డంపింగ్ యార్డు కాలిపోవడంతో వెలువడుతున్న దుర్వాసన పొగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. ఈ కాలుష్యం వల్ల పరిసరాల్లో నివసిస్తున్న ప్రజలకు రోగాలు వచ్చి, ఇబ్బందులు ఎదురై, ప్రాణ నష్టం జరుగితే ఎవరు బాధ్యులని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఎప్పటికప్పుడు మంటలను అదుపు చేయాలని, నివాసాలు లేని చోటుకి డంపింగ్ యార్డ్‌ను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన చెత్త





డంపింగ్ యార్డ్‌లో చెలరేగిన మంటలు

మహనీయుడు అంబేద్కర్ : మంత్రి వనిత

ప్రజాశక్తి- కడియం

భారతదేశానికి గొప్ప రాజ్యాంగం అందించిన మహనీయుడు అంబేద్కర్ అని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. రూ.14 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనం, అంబేద్కర్ మందిరాన్ని ఎంపీ భరత్‌రామ్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ చందన నాగేశ్వర్, ఆనం ఎలక్ట్రికల్స్ డైరెక్టర్ విజయకుమార్ రెడ్డిలతో కలిసి ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడారు. తాను హోం మంత్రిగా గొప్ప స్థానంలో ఉన్నానంటే అందుకు అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే కారణమన్నారు. దళితుల కోసం చక్కని కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఆనం ఎలక్ట్రికల్స్ అధినేత ఆనం జయలక్ష్మి, ప్రేమ కుమార్ రెడ్డి దంపతులను మంత్రి అభినందించారు. ఆనం ఎలక్ట్రికల్స్ డైరెక్టర్ విజయకుమార్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు వై.స్టాలిన్, సర్పంచ్ మార్గాని అమ్మాణి, వైసిపి నాయకులు తాడాల చక్రవర్తి, ఈలి గోపాలం, తిరుమలశెట్టి శ్రీనివాస్, ఆరేటి వెంకటరావు పాల్గొన్నారు.



ఆనం విజయకుమార్ రెడ్డి ని సత్కరిస్తున్న హోం మంత్రి వనిత , తదితరులు

ఇంటి నిర్మాణాల వేగవంతానికి పిలుపు

ప్రజాశక్తి - పెరవలి

ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. ఆదివారం పెరవలి మండలం ముక్కామలలో నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకం లబ్ధిదారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందించి లేవుట్లలో స్థలాలను అప్పగించామన్నారు. నిర్మాణాల కోసం నిర్మాణ సమాగ్రి ఇతర ఆర్థిక సాయం అందించామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. సొంతింటి కల నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపిపి కె.సీతారాంప్రసాద్, వైస్ ఎంపిపి వేంద్ర శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు గండేపల్లి రామకృష్ణ, సొసైటీ ఛైర్మన్ రేలంగి ఏసు, వైసిపి మండల అధ్యక్షులు వీరమళ్ల సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.



పట్టాలు పంపిణీ చేసిన ఎంఎల్ఎ జి.శ్రీనివాస నాయుడు

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్యచౌదరి ఆధ్వర్యంలో ఘనంగా నారా చంద్రబాబు 73వ పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. కోటిపల్లి బస్టాండ్ వద్ద నున్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఈ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ హాజరయ్యారు. తొలుత గోరంట్ల ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి వారికి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు నాయుడు గారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. 100 మంది ఆటో కార్మికులకు లుంగీలు, టవల్స్ అందించారు. మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెలుగుబంటి సత్య ప్రసాద్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాశీ నవీన్ కుమార్,రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు మార్గాన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. క్వారీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి భవాని, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, టీడీపీ బీసీ సాధికార సమితి శెట్టిబలిజ విభాగం రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు సమకూర్చిన సుమారు 250 చీరలను పేదలకు పంపిణీ చేశారు.



ట్రై సైకిళ్లు అందజేస్తున్న రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని వేగేశ్వరపురం కెఎస్ఆర్ జడ్‌పిహెచ్ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 1979వ సంవత్సరంలో పదోతరగతి విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. తాళ్లపూడిలోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. 40 మంది పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీ సీజ్

ప్రజాశక్తి - గోపాలపురం

ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారంగా మట్టిని తరలిస్తున్న లారీని సీజ్ చేశామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు గ్రామంలో భీముడు చెరువు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారకంగా టిప్పర్ పై మట్టిని తరలిస్తున్నారని తెలిపారు. శనివారం గోపాలపురం చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనికీ చేస్తుండగా దీన్ని గుర్తించామన్నారు. అనుమతులు లేకపోవడంతో లారీని సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. అనుమతులు లేకుండా మట్టి, ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



సీజ్‌చేసిన లారీ

నేడు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

ప్రజాశక్తి - పెరవలి

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించనున్నామని ఎంపిపి కె.సీతారాంప్రసాద్, ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల పనితీరు ఆధారంగా ఇచ్చే మండల స్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారం-2023కి మండలంలో 9 పంచాయతీలు ఎంపికయ్యాయని అన్నారు. ఎంపికైన అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కాకరపర్రు, కానూరు, తీపర్రు, ఊసులుమర్రు, కొత్తపల్లి అగ్రహారం, కాపవరం, నడుపల్లి పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు ఈ అవార్డులు అందిస్తామని అన్నారు. సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.



పరీక్షకు హాజరైన విద్యార్థులు

ప్రశాంతంగా గురుకులం ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ప్రవేవ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపల్ తాళ్లూరి ఉమాదేవి తెలిపారు. జిల్లాలో 5 గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఈ పరీక్షలు జరిగాయన్నారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 341 మందికి 300 మంది, ఇంటర్‌లో ప్రవేశాలకు 347 మందికి 320 మంది పరీక్ష రాశారని తెలిపారు.